# రేయింబవళ్లు శ్రమించి..

మిచాంగ్ తుఫాన్ విపత్తులో సింహభాగం కష్టం, నష్టం విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బందిదే.. చాలాచోట్ల స్తంభాలు పడిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ సమయంలో ఆ శాఖ ఎంతో కష్టపడి పనిచేసింది. వేగంగా స్పందించి సరఫరాను పునరుద్ధరించింది.

**తుఫాన్ కారణంగా పడిపోయిన విద్యుత్ స్తంభాలు**
- కష్టపడి పనిచేసిన విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది
- కొత్త స్తంభాల ఏర్పాటు
- సరఫరాను పునరుద్ధరించిన వైనం


పడిపోయిన విద్యుత్ స్తంభం


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది


కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఇందుకూరుపేట: విద్యుత్ సరఫరా లేకపోతే ఎన్నో పనులు ఆగిపోతాయి. జనజీవనం స్తంభించిపోతుంది. మానవ జీవితం కరెంట్‌తో అంతలా ముడిపడింది. మంచినీరు తాగాలన్నా, ఆహారం తయారు చేసుకోవాలన్నా విద్యుత్ పరికరాలు వినియోగించాల్సిందే. మిచాంగ్ తుఫాన్ కారణంగా వీచిన గాలులకు చెట్లు పడిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలి సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది రేయింబవళ్లు శ్రమించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు నిద్రలేని రాత్రులు గడిపారు.

**వందల సంఖ్యలో..**

మండలంలో 11 విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో సుమారు 30 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. సబ్‌స్టేషన్లకు సరఫరా అందించేందుకు ఐదు 33 కేవీ ప్రధాన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు. కాగా సముద్ర తీర ప్రాంత మండలం కావడంతో తుఫాన్ కారణంగా 33 కేవీకి సంబంధించిన స్తంభాలు 53 వరకు నేలవాలాయి. సబ్‌స్టేషన్ నుంచి గ్రామాలకు వెళ్లే 11 కేవీ స్తంభాలు 250 వరకు పడిపోయాయి. వైర్లు తెగిపోయాయి. చేపలు, రొయ్యల గుంతలు, పొలాలు తదితర ప్రాంతాల్లో ఈ నష్టం అధికంగా వాటిల్లింది. చెట్లు తీగలపై పడిపోవడంతో వాటి వద్దకు చేరుకునేందుకు విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. దీనికితోడు జోరువాన, పెనుగాలులు అప్పుడప్పుడూ పనులకు ఆటంకం కలిగించాయి. విధులు నిర్వహించడం వారికి కత్తిమీద సాములా మారింది. అయినా లెక్క చేయలేదు. కాగా తుఫాన్ కారణంగా ఆస్తి నష్టం జరిగినా ప్రాణ నష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

**యుద్ధప్రాతిపదికన..**

తుఫాన్ కారణంగా మండలంలో నెలకొన్న అంధకారాన్ని తొలగించి, వెలుగులు నింపేందుకు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది రేయింబవళ్లు కష్టపడ్డారు. సరఫరా పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. అన్ని పనులను పూర్తి చేసి మండలవాసులకు సరఫరాను అందిస్తున్నారు. వ్యవసాయానికి, పరిశ్రమలకు కొంత సమయం పట్టినా, గృహాలకు మాత్రం ఒకటి, రెండు రోజుల్లోనే పునరుద్ధరించడంతో విద్యుత్ శాఖ అధికారులు అందరి మన్ననలు పొందారు.

**ఎంతో కష్టపడ్డాం**



మండలం తీర ప్రాంతం కావడంతో తుఫాన్ నష్టం ఎక్కువగా ఉంది. పడిన స్తంభాలు, తెగిన వైర్లు రొయ్యలు, చేపల గుంతలు, చెట్లు, పొలాల మధ్యలో ఉండడంతో మరమ్మతులు చేయడం సిబ్బందికి కష్టంగా మారింది. సరఫరాను పునరుద్ధరించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది కష్టపడి పనిచేశారు.

– సునీల్‌కుమార్, అసిస్టెంట్ ఇంజినీర్, విద్యుత్ శాఖ

## తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


పెదరాజుపాళెం వద్ద పైపులు

పొదలకూరు: పొదలకూరు పట్టణ శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక పైపులైన్ నిర్మాణం పనులకు పైపులను దిగుమతి చేసుకున్నారు. పట్టణానికి ప్రత్యేక పైపులైన్ నిర్మాణం ద్వారా మంచినీటిని అందించేందుకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో రూ.3.93 కోట్ల అంచనాలతో పనులను ప్రారంభించారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేసి పైపులైన్ ద్వారా పట్టణానికి తాగునీటిని అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని పెదరాజుపాళెం వద్ద పైపులను దిగుమతి చేసుకున్నారు. మొత్తం 15 వేల మీటర్ల మేరకు లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని ఆ శాఖ ఏఈ కె.కసనానాయక్ వెల్లడించారు.

**ట్యాంక్ నిర్మాణం**

పట్టణంలోని వినాయకమాన్యంలో మంచినీటి ట్యాంక్‌ను నిర్మించి ప్రత్యేక పైపులైన్ ద్వారా కండలేరు జలాలను తీసుకొచ్చి 50 శాతం మంది పట్టణ ప్రజలకు సరఫరా చేసేందుకు అంచనాలు వేశారు. మిగిలిన 50 శాతం మందికి పట్టణంలో ఉన్న ట్యాంకుల నుంచి పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కండలేరు నుంచి పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి పట్టణ ప్రజలకు ప్రతినిత్యం తాగునీటిని అందించడమే ప్రధాన లక్ష్యంగా పనులు చేపడుతున్నారు. ఒకటి, రెండు నెలల్లో పనులను పూర్తి చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ప్రతినిత్యం మంచినీటి సరఫరా కోసం ఎంతోకాలంగా ప్రజలు ఎదురు చూస్తున్నారు. వారి ఎదురుచూపులను నిజం చేసేందుకు మంత్రి కాకాణి కృషి చేస్తున్నారు.

## వ్యాయామం చేయండి : ప్రసన్న


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు: ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని, దీని వల్ల ఆరోగ్యంగా ఉంటారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాలుచింతల సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన న్యూ హైటెక్ జిమ్ స్టూడియోను ఆదివారం రాత్రి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిమ్ అధినేత ప్రశాంత్, డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరసింహులురెడ్డి, గాజుల మల్లికార్జున్, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం

- చెరువులో ఉన్న విద్యుత్ లైన్‌కు మోక్షం
- రహదారి వెంబడి కొత్త లైన్ నిర్మాణం
- గడప గడపకు కార్యక్రమంలో సమస్యను గుర్తించిన మంత్రి కాకాణి


రహదారి వెంబడి నిర్మించిన కొత్త విద్యుత్ లైన్

పొదలకూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతున్నాయి. మండలంలోని బిరదవోలు పంచాయతీ కల్యాణపురం గ్రామానికి దశాబ్దాల క్రితం బిరదవోలు చెరువు నుంచి విద్యుత్ స్తంభాలు నాటి లైన్లు వేశారు. అయితే వర్షాకాలంలో చెరువు నిండిన సమయంలో తీగలు మరమ్మతులకు గురైతే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రోజుల తరబడి గ్రామానికి, వ్యవసాయానికి సంబంధించిన మోటార్లకు కరెంట్ అందేది కాదు. దశాబ్దాలుగా గ్రామస్తులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. విద్యుత్ అధికారులు, నాయకుల దృష్టికి ఎన్ని పర్యాయాలు తీసుకెళ్లినా చేస్తాం.. చూస్తాం అనేవారు.

**మంత్రి ఆదేశాలతో..**

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాక రాతపూర్వకంగా అర్జీని సైతం అందజేశారు. వెంటనే స్పందించిన మంత్రి విద్యుత్ అధికారులను పిలిచి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు.

**స్పందించిన అధికారులు**

మంత్రి ఆదేశాలతో విద్యుత్ పొదలకూరు ఏడీఈ సురేంద్రబాబు స్పందించి లైన్ మార్చేందుకు అంచనాలు రూపొందించారు. చెరువులో ఉన్న విద్యుత్ లైన్‌తో పనిలేకుండా కొత్తగా రహదారి వెంబడి కల్యాణపురం వరకు విద్యుత్ లైన్ నిర్మాణం చేపట్టారు. దీంతో గ్రామస్తుల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. సమస్యపై వెంటనే స్పందించి ఆగమేఘాలపై పనులు చేయించిన మంత్రి కాకాణికి గ్రామస్తులు కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

పొదలకూరు: పట్టణానికి సమీపంలో లింగంపల్లితోపు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా ఇన్‌చార్జి ఎస్సై మస్తానయ్య కేసు నమోదు చేశారు. ఆయన ఆదివారం వివరాలు వెల్లడించారు. నెల్లూరు డైకస్‌రోడ్డులో నివాసం ఉంటున్న మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాలకొండయ్య ప్రమాదంలో గాయపడ్డాడు. బేల్దారి మేస్త్రీగా జీవనం సాగిస్తున్న బాధితుడు ద్విచక్ర వాహనంలో వెనుకవైపు కూర్చొని సెంట్రింగ్ సామగ్రిని పట్టుకుని ఉండగా మొగళ్లూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ తగిలి దూరంగా పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న మాలకొండయ్య పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

### యూటీఎఫ్ సమావేశం


మాట్లాడుతున్న నాయకులు

కోవూరు: పడుగుపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం యూటీఎఫ్ 49వ కౌన్సిల్ సమావేశం జరిగింది. పలు అంశాలపై వక్తలు మాట్లాడారు. అనంతరం పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చలపతిశర్మ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పెన్షనర్ల దినోత్సవం


సీనియర్ పెన్షనర్లకు సత్కారం

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని పీఎస్ రామానుజాచార్యులు పింఛనర్ల సంక్షేమ సంఘ భవనంలో జాతీయ పింఛనర్ల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పింఛన్ పొందేందుకు ఆద్యుడైన నకరా చిత్రపటానికి నివాళులర్పించారు. ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం 70 ఏళ్లు నిండిన 50 మంది పింఛనర్లను సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్, ఎస్వీఎస్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, డివిజనల్ సబ్ ట్రెజరీ అధికారి అహ్మద్, ఇందిరా సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ అధినేత డాక్టర్ వివేకానంద రెడ్డి, కోవూరు, ఇందుకూరుపేట సబ్ ట్రెజరీ అధికారులు కిరణ్‌కుమార్, రమణరావు, సంఘ కోశాధికారి హజరత్తయ్య, ఖాసిం, వేణు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### విష్ణాలయంలో ధనుర్మాస పూజలు


విష్ణుమూర్తికి పూజలు చేస్తున్న అర్చకుడు

మనుబోలు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవాలయం (విష్ణాలయం)లో ఆదివారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. అర్చకులు హనుమాచార్యులు సూర్యోదయానికి ముందే స్వామికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

### భవన నిర్మాణానికి విరాళాల సేకరణ


యల్లాయపాళెంలో విరాళాలు సేకరిస్తున్న నాయకులు

కొడవలూరు: దేశ రాజధాని ఢిల్లీలో నిర్మించనున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం భవనానికి మండలంలోని యల్లాయపాళెంలో ఆదివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు విరాళాల సేకరణ ద్వారా భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య, సభ్యులు మాల్యాద్రి, దేవకుమారి, మండల కమిటీ సభ్యులు బి.కాంతారావు, దేవానంద్ పాల్గొన్నారు.

### పొలాలకు వెళ్లే దారికి మరమ్మతులు


జేసీబీతో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు గ్రామం పొలాలకు వెళ్లే మార్గం ఇటీవల తుఫాన్ సమయంలో వరద కారణంగా దెబ్బతింది. దీంతో రైతులు ఎరువులు తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాలతో ఆదివారం గ్రామ ఉప సర్పంచ్ ఆవుల తులసీరామ్ ఆధ్వర్యంలో జేసీబీ ద్వారా దారికి మరమ్మతులు చేశారు. గండ్లను పూడ్చి దారిని సరిచేశారు. ఈ పనులను పోతయ్య, సురేష్, శంకరయ్య, పెంచలయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు.

### శ్రీవెంకటేశ్వర కళాశాలకు అవార్డు



అవార్డుతో గవర్నింగ్ బాడీ సభ్యులు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలకు 'అకడమిక్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెక్స్ – 2023' అవార్డు దక్కింది. ప్రఖ్యాత సంస్థ 'ది అకడమిక్ ఇన్‌సైట్స్' ఆధ్వర్యంలో బెంగళూరులో ఆదివారం జరిగిన సదస్సులో అవార్డును ఆ కళాశాల గవర్నింగ్ బాడీ మెంబర్స్ కె.సునీల్‌కుమార్ యాదవ్, పి.సాయికృష్ణ యాదవ్ అందుకున్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు శిక్షణ, ఉపాధి కల్పనలో ఎనలేని కృషి చేసి ముందంజలో నిలిచినందుకు ఈ అవార్డు వచ్చిందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ప్రిన్సిపల్ వి.అనిల్ కుమార్ మాట్లాడుతూ అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు.

### గండవరం యోగా గురువు ప్రతిభ


ట్రోఫీ అందుకుంటున్న రాజేంద్రకుమార్

కొడవలూరు: మండలంలోని గండవరం ఆయుర్వేద వైద్యశాల యోగా మాస్టర్ జ్యోతి రాజేంద్రకుమార్‌కు సౌతిండియా వజ్రా యుద్ధం యోగా చాంపియన్‌షిప్ దక్కింది. సూళ్లూరుపేట రాఘవరెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సౌతిండియా యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో ఆయన ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచారు.

# నేనున్నానంటూ..


నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- బాధితులకు ఎమ్మెల్యే ప్రసన్న భరోసా

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): ఓ కుటుంబానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అండగా నిలిచారు. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల వచ్చిన తుఫాన్ కారణంగా బుచ్చిరెడ్డిపాళెం 18వ వార్డు పెద్దూరులోని కోనేటిమిట్టకు చెందిన ఎస్‌కే నూర్‌జహాన్‌పై చెట్టు విరిగి పడింది. ఈ ప్రమాదంలో ఆమె మృతిచెందింది. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నూర్‌జహాన్ ఇద్దరు ఆడపిల్లల సంరక్షణకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.2 లక్షల ఆర్థిక సాయం చేశారు. అందుకు సంబంధించిన నగదును ఆదివారం బుచ్చిరెడ్డిపాళెంలో అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, 18, 15వ వార్డు కౌన్సిలర్లు మోర్ల భరత్ జయింతి, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీనివాసుని కల్యాణం


ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు


పూజల్లో పాల్గొన్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీనివాసుని కల్యాణం వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా సాయిమోహన్‌రెడ్డి – ప్రసన్నకుమారిరెడ్డి దంపతులు వ్యవహరించారు. ధనుర్మాసం ప్రారంభ రోజున శ్రవణా నక్షత్రంలో కల్యాణం నిర్వహించడం ఎంతో విశిష్టత నెలకొంది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్న ప్రసాదాలను అందజేశారు.

- వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి ధనుర్మాస పూజలను ప్రారంభించారు. తెల్లవారుజామున ప్రత్యేక పూజలను నిర్వహించారు.

## తుఫాన్ బాధితులకు ఆర్థిక సాయం


పొదలకూరు: శ్రామిక నగర్లో..


పొదలకూరు: అగచాట్లపురంలో..

పొదలకూరు: మిచాంగ్ తుఫాన్ బాధితులకు ఆదివారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని పంపిణీ చేశారు. శ్రామిక నగర్లో ఒక్కో కుటుంబానికి రూ.2,500 వంతున వైస్ ఎంపీపీ సోమా అరుణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీహరి, నాయకులు సోమా భాస్కర్, సోమా రామకృష్ణయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

**అగచాట్లపురంలో..**

పట్టణంలోని అగచాట్లపురం, రామనగర్‌గేట్ సెంటర్‌లో బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2,500 వంతున నగదును సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీహరి, సచివాలయ కన్వీనర్లు వాకాటి శివప్రసాద్‌రెడ్డి, సురేఖ, ఖాదర్, వార్డు సభ్యుడు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.


మనుబోలు: నగదు అందజేస్తున్న సర్పంచ్

- మనుబోలు: మండలంలోని బద్దెవోలు గ్రామంలో తుఫాన్ కారణంగా నష్టపోయిన గిరిజనులకు ఆదివారం వీఆర్వో భగవాన్ ప్రభుత్వ పరిహారం అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.2,500 వంతున నగదును సర్పంచ్ ఉగ్గుమూడి శశికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు భీమవరపు బాలకృష్ణారెడ్డి, బద్దెవోలు కృష్ణయ్యల చేతుల మీదుగా ఇచ్చారు.

## టీడీపీ నాయకుడి అక్రమాల పర్వం

- మనీస్కీం పేరుతో భారీగా నగదు స్వాహా
- గ్రామకంఠం భూమి 10.64 ఎకరాల ఆక్రమణ
- ఎస్సీ, ఎస్టీల పేర్లతో తప్పుడు పత్రాలు సృష్టించిన చేవూరు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన దంపూరుకు చెందిన బాధితులు


రాంప్రసాద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు


రాంప్రసాద్ ఆక్రమించిన గ్రామకంఠం భూమి

కోవూరు: విడవలూరు మండలం దంపూరుకు చెందిన టీడీపీ నాయకుడు చేవూరు రాంప్రసాద్ అక్రమాలకు తెగబడ్డాడు. పదెకరాల గ్రామకంఠం భూమిని కబ్జా చేయడంతోపాటు మనీస్కీం పేరుతో అమాయక ప్రజల నుంచి భారీగా నగదు స్వాహా చేశాడు. రాంప్రసాద్ బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వివరాలు.. దంపూరుకు చెందిన చేవూరు రాంప్రసాద్ అమాయక ప్రజలను మోసం చేయడమే దినచర్యగా పెట్టుకున్నాడు. గతంలో టీడీపీలో ఉన్న ఆయన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలో చేరారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్రమాలకు తెరలేపడంతో విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అధిష్టానం పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అప్పటి నుంచి మళ్లీ టీడీపీకు అనుకూలంగా ఉంటూ వస్తున్నారు. 2011లో ఆయన మనీస్కీం పేరుతో హెవెన్లీ ఇంటర్ డెనోమినల్ మిషన్ ట్రస్ట్ ద్వారా అమాయక ప్రజల నుంచి దాదాపు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వసూలు చేసి స్వాహా చేశాడు. ఆయన చేతిలో మోసపోయిన బాధితులు న్యాయం చేయాలని కోరుతూ గతంలో పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు సైతం అందజేశారు.

**గ్రామకంఠం ఆక్రమణ**

విడవలూరు మండలం దంపూరులోని సర్వే నంబరు 418లో ఉన్న 10.64 ఎకరాల గ్రామకంఠం భూమిని రాంప్రసాద్ ఆక్రమించాడు. తన పేరుపై భూమి ఉంటే సమస్యలు వస్తాయని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తన అనుచరులైన ఎస్సీ, ఎస్టీల పేర్లపై తప్పుడు పాసు పుస్తకాలు సృష్టించి తన గుప్పెట్లో ఉంచుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గ్రామకంఠం భూమిలో హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. ఎస్సీ, ఎస్టీలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయాలనుకున్న రాంప్రసాద్ తలంపును అదే గ్రామానికి చెందిన మరికొందరు ఎస్సీ, ఎస్టీలు అడ్డుకున్నారు. గ్రామకంఠం భూమిని స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పగించాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే రాంప్రసాద్ చేతిలో మోసపోయిన మనీస్కీం బాధితులు న్యాయం చేయాలని బుచ్చిరెడ్డిపాళెం సీఐ హైమారావుకు ఫిర్యాదు చేశారు.

## పార్టీ విజయం కోసం కృషి చేస్తా


ధనలక్ష్మి

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం తనవంతు కృషి చేస్తానని ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బుచ్చిరెడ్డిపాళెం మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పుట్టా ధనలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మహిళా విభాగంలో తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మహిళల కోసం జగనన్న ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు.